సాక్షి
హనుమకొండ

మంగళవారం । 28 । జనవరి । 2025



రిజర్వేషన్ల హామీ ఏమైంది..?

బీసీలకు 'స్థానిక' ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి ఏడాదైనా స్పష్టత లేదని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. - 8లో ▸



కూలీ పనికి వెళ్లివస్తూ..

కూలీ పనికి వెళ్లివస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 13 మంది గాయపడ్డారు. అందులో ఒకరు మృతి చెందారు. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^{0}/18^{0}$

ఉదయం పొగమంచు కారణంగా చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

కలెక్టర్ బంగ్లాకు కొత్త హంగులు

రూ. 2 కోట్లతో మరమ్మతులు

- హైదరాబాద్ సిటీ కాలేజ్, సెంట్రల్ లైబ్రరీ తరహాలో..
- మార్చి చివరి నాటికి పనుల పూర్తికి చర్యలు
- పర్యవేక్షిస్తున్న 'కుడా' అధికారులు



హన్మకొండ అర్బన్: కలెక్టర్ నివాసంగా ఇంతకాలం వినియోగించిన భవనం త్వరలో కొత్త రూపు సంతరించుకోనుంది. సుమారు 138 ఏళ్ల క్రితం చేపట్టిన నిర్మాణం కావడంతో మళ్లీ అప్పటి పద్ధతుల్లోనే పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా నిర్మాణంలో సిమెంట్, ఇసుక కాకుండా బెల్లం, కరక్కాయ, కెమికల్ మిక్స్ చేసి డంగు సున్నం మాదిరిగా తయారు చేసి నిర్మాణానికి వినియోగించి హైదరాబాద్ సిటీ కాలేజ్, సెంట్రల్ లైబ్రరీ తరహాలో తీర్చిదిద్దనున్నారు. ఈ పనులను హైదరాబాద్‌లో పురాతన, హెరిటేజ్ భవనాల మరమ్మతు, పునర్నిర్మాణంలో అపార అనుభవం కలిగిన క్షేత్ర కన్సల్టెన్సీ దక్కించుకుంది. మార్చి చివరి నాటిని పూర్తి చేసేలా చర్యలు చేపట్టింది. కలెక్టర్ ప్రావీణ్య నేతృత్వంలో 'కుడా' అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

రూపుదిద్దుకోనున్న ప్యాలెస్..

ప్రస్తుత భవనం పూర్తి స్థాయిలో ఆధునీకీకరించడానికి రూ.2కోట్లకుపైగా ఖర్చవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ముందు సివిల్ వర్క్స్ పూర్తి చేసి తర్వాత ఇతర పనులు, మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. పనులు పూర్తయి ప్యాలెస్ రూపుదిద్దుకున్నాక అందులో లైబ్రరీ, కాఫీ షాప్ ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. వేసవి సెలవుల నాటికి ఈ ప్యాలెస్ సందర్శకులను కనువిందు చేయనుంది.

పాత నిర్మాణ శైలి దెబ్బతినకుండా..

క్షేత్ర కన్సల్టెన్సీ హైదరాబాద్ సిటీకాలేజ్, సెంట్రల్ లైబ్రరీ, యునానీ ఆస్పత్రిని నవీకరించారు. అయితే సెంట్రల్ లైబ్రరీ పనులు ఇంకా కొనసాగుతున్నందున అక్కడ ఏర్పాటు చేసిన ప్లాంట్ నుంచి మెటీరియల్ తీసుకురానున్నట్లు కాంట్రాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ముందుగా ల్యాబ్ టెస్ట్ చేసి ఓకే అన్నాక మెటీరియల్ ఇక్కడికి తరలిస్తామని, ముఖ్యంగా నిర్మాణ క్రమంలో పాత శైలి దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భవనం పాడయిన చోట మరమ్మతులు చేపట్టున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

వైభవంగా శివకల్యాణం



హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల ఆలయంలో సోమవారం పుష్య మాసం బహుళ త్రయోదశి సందర్భంగా వేద పండితులు, అర్చకులు శివకల్యాణం జరిపించారు. గణపతి ఆరాధన, రుద్రేశ్వర స్వామివారికి లఘున్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే మాస శివరాత్రి కావడంతో ఆలయ నాట్యమండపంలో రుద్రేశ్వరి, రుద్రేశ్వర స్వామి వారికి వైభవంగా కల్యాణం చేశారు. ఫిబ్రవరి 26వ తేదీన దేవాలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు జీఎంఆర్ గ్రూప్స్ అధినేత రూ.లక్ష చెక్కును దేవాలయ ఈఓ వెంకటయ్యకు అందజేశారు. అలాగే స్వామివారి అలంకరణ కోసం 108రుద్రాక్షల వెండితో అల్లించిన దండను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ఎంజీఎం : వైద్యాధికారులు ప్రజలకు మెరుగైన సేవలందించాలి.. ఇదే క్రమంలో ప్రజలు కూడా ప్రభుత్వ సేవలను సద్వినియోగించుకోవాలని కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ రాజ్ కుమార్, శరవణ్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు, ఆస్పత్రుల్లో వసతులను పరిశీలించేందుకు వచ్చిన భారత ప్రభుత్వ పాపులేషన్ రిసెర్చ్ సెంటర్ గాంధీ గ్రామ్, తమిళనాడు బృందం సభ్యులు సోమవారం హనుమకొండ జిల్లాలో ధర్మసాగర్, ఉనికిచర్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ఎల్కతుర్తి పీహెచ్‌సీ పరిధి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పోచమ్మకుంట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిత వ్యాధులు, పీఎంఎస్ఎంవై, ఈ–ఔషధీ, టీబీ, ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, 102, 108, ఆర్‌బీఎస్‌కే సేవలుపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ అధికారి డాక్టర్ ఇఫ్తాదర్ అహ్మద్, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ గోపీనాథ్, అరవింద్, శ్వేత, దీప్తి, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత్‌కు 14 రోజుల రిమాండ్



శాయంపేట : గట్లకానిపర్తిలో ప్రభుత్వం సంక్షేమ పథకాల ప్రారంభోత్సవానికి ఆదివారం విచ్చేసిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పై కోడి గుడ్లు విసిరిన ఘటనలో అదే గ్రామానికి చెందిన బొమ్మంటి ప్రశాంత్‌పై శాయంపేట సీఐ రంజిత్‌రావు కేసు నమోదు చేశారు. సోమవారం అతడిని పరకాల కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ లింగం శాలిని 14రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే సహించేది లేదని, చట్టం పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'రైతు భరోసా'కు వేళాయె..

- జిల్లాలో 1,42,009 మంది రైతులు
- కొత్తగా పాస్‌పుస్తకాలు పొందినవారు 7,217 మంది
- మొదటి విడత 12 గ్రామాల్లో 12,637 మందికి అమలు



హన్మకొండ : అన్నదాతలకు పంట పెట్టుబడి సాయం రైతు భరోసా ఎట్టకేలకు ప్రారంభమైంది. యాసంగి నుంచి ప్రభుత్వం ఒక పంటకు ఎకరాకు రూ.6వేల చొప్పున, రెండు పంటలకు రూ.12వేలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగే సాగుకు యోగ్యం కానీ భూములకు రైతుబంధు ఇచ్చారని, సాగు భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలోని ప్రతి మండలంలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేశారు. జిల్లాలో 12 మండలాల పరిధి 12 గ్రామాల నుంచి 12,637 మంది రైతులను ఎంపిక చేయగా.. రూ.14,29,52,973 జమ కావాల్సి ఉంది. సోమవారం 12,470 మంది రైతులకు సంబంధించి రూ.14,24,20,961 అకౌంట్లలో జమయ్యాయి.

జిల్లాలో క్లియర్ ఖాతాలు..

జిల్లాలో బ్యాంకు ఖాతాలు క్లియర్‌గా ఉన్న రైతులు 1,42,009 మంది ఉండగా రూ.1,54,07,97,429 రైతు భరోసా సాయం పొందనున్నారు. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు 7,217 మంది ఉన్నారు. వీరి బ్యాంక్ ఖాతాలను వ్యవసాయ అధికారులు అప్‌లోడ్ చేయనున్నారు. వీరి బ్యాంక్ ఖాతాలు అప్‌లోడ్ చేస్తే మొత్తం 1,49,226 అన్నదాతలు రైతు భరోసా పొందనున్నారు. జిల్లాలో సాగుకు యోగ్యం కాని భూములు 6,500 ఎకరాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు, రియల్ ఎస్టేట్ స్థలాలు, గుట్టలు, రాళ్లరప్పలున్న భూములు ఉన్నాయి.

మొదటి విడతలో జిల్లాలోని ఆత్మకూర్ మండలం గుడెప్పాడ్, భీమదేవరపల్లి, దామెర, ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి, ఎల్కతుర్తి మండలం వీరనారాయణపురం, హసన్‌పర్తి మండలం పెంబర్తి, ఐనవోలు మండలం రాంనగర్, కమలాపూర్ మండలం దేశరాజుపల్లి, నడికూడ మండలం చౌటుపర్తి, పరకాల మండలం పైడిపల్లి, శాయంపేట మండలం గట్లకానిపర్తి, వేలేరు మండలం శాలపల్లి గ్రామ రైతులు పెట్టుబడి సాయాన్ని పొందారు.

మండలాల వారీగా రైతు భరోసా వివరాలు (రూ.లలో)..

(కొత్త పట్టాలు పొందిన వారిని మినహాయించి)

మండలం	రైతులు	సాయం(రూ.లు)
ఆత్మకూర్	10,153	9,63,85,191
భీమదేవరపల్లి	10,905	14,26,06,781
దామెర	7,745	8,49,07,234
ధర్మసాగర్	12,399	15,51,49,446
ఎల్కతుర్తి	11,798	13,10,27,231
హనుమకొండ	1,695	1,07,46,468
హసన్‌పర్తి	14,689	13,64,74,953
ఐనవోలు	13,208	16,05,73,866
కమలాపూర్	15,558	16,07,85,194
కాజీపేట	6,906	6,59,61,848
నడికూడ	10,344	10,77,56,520
పరకాల	7,477	7,32,79,098
శాయంపేట	10,913	10,63,61,167
వేలేరు	8,219	10,87,82,432
మొత్తం	142,009	154,07,97,429

జెడ్పీకి కాసుల కటకట

- జిల్లాల పునర్విభజనతో ఆదాయ లోటు
- సాధారణ ఖర్చులకూ ఇబ్బందులే..
- స్వీపర్లకు జీతాలు చెల్లించలేని దుస్థితి
- వాణిజ్య సముదాయ షటర్లకు టెండర్లు

హన్మకొండ: హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారింది. జనరల్ ఫండ్ లేకపోవడంతో సాధారణ ఖర్చులకూ ఇబ్బందులు తప్పడం లేదు. స్వీపర్లకు జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కాసుల వేట మొదలు పెట్టింది. జెడ్పీకి చెందిన ప్రగతి ఎంపోరియం వాణిజ్య సముదాయ షెట్టర్లకు ఎట్టకేలకు టెండర్లు పిలిచారు. కొన్నేళ్లుగా అద్దె పెంచేందుకు ప్రయత్నించినా ప్రతికూల పరిస్థితులతో జాప్యం జరిగింది. జిల్లా ప్రజాపరిషత్ ప్రత్యేక పాలనాధికారిగా కలెక్టర్ బాధ్యతలు స్వీకరించడంతో ఆదాయం పెంచుకునేందుకు మార్గం సుగమమైంది. ఫిబ్రవరి 1 నుంచి టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నారు. 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు ఓపెన్ చేస్తారు.

అత్యంత దయనీయం..

జిల్లాల పునర్విభజన తర్వాత హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ సాధారణ ఖర్చులు కూడా భరించలేని దుస్థితికి చేరింది. సాధారణ నిధులైన పర్ క్యాపిట, సీనరేజీ, స్టాంప్ డ్యూటీ 2016 సంవత్సరం నుంచి రావట్లేదు. జనాభా ప్రాతిపదికన ప్రతి ఒక్కరికీ రూ.4 చొప్పున ప్రభుత్వం జెడ్పీలకు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే సీనరేజీ 25 శాతం, స్టాంప్ డ్యూటీ 25 శాతం జమ చేయాలి. తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం, సంబంధిత శాఖలు ఈ మొత్తం సొమ్మును జమ చేయట్లేదు. 2018లో జెడ్పీ యాజమాన్యం ఒత్తిడి మేరకు స్టాంప్ డ్యూటీ రూ.50 లక్షలు చెల్లించినట్లు సమాచారం. ఆ తర్వాత నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిధులు రాలేదు. దీంతో అధికారుల వాహనాలకు డీజిల్ ఖర్చులు, స్వీపర్ల జీతాలు, కార్యాలయం మెయింటనెన్స్ ఖర్చులను అధికారులు, ఉద్యోగులు సొంతంగా భరిస్తున్నారు. సాధారణ నిధులు కరువవడంతో ఎనిమిది నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. జిల్లా పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న స్వీపర్లకు సాధారణ నిధుల నుంచి జీతాలు చెల్లిస్తారు. వాటికోసం ప్రతి నెలా ఎదురుచూస్తున్నారు. ఎవరైనా అతిథులు వస్తే కనీస మర్యాదగా తేనీటి విందు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం ఉంది. ఈ క్రమంలో అందుబాటులో ఉన్న వనరుల ద్వారా ఆదాయాన్ని రాబట్టుకోవాలనే ఆలోచనతో వాణిజ్య సముదాయం షెటర్లకు కొన్నేళ్ల క్రితం ఖరారైన అద్దెను పెంచుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ప్రజాప్రతినిధుల పాలక మండలి ఉన్న సమయంలోనే పెంచాలని భావించినా పాలకవర్గం నుంచి సహకారం లభించలేదని తెలిసింది. పాలకవర్గం పదవీ కాలం పూర్తయి కలెక్టర్ ప్రత్యేకాధికారిగా నియమించడంతో మార్గం సుగమమైంది.



హనుమకొండ జెడ్పీ ప్రగతి ఎంపోరియం వాణిజ్య భవన సముదాయం

కమిటీ వేసి.. టెండర్లు పిలిచి

సుబేదారి మెయిన్ రోడ్డులో పోస్టాఫీస్‌ను ఆనుకుని హనుమకొండ జెడ్పీకి వాణిజ్య సముదాయం ఉంది. ఇందులో ఏడు షట్టర్లు ఉండగా.. నాలుగు మెయిన్ రోడ్‌కు, మూడు షెట్టర్లు జులైవాడ రోడ్డుకు ఉన్నాయి. మొదటి అంతస్తులో కార్యాలయాల నిర్వహణకు అనువైన భవనం ఉంది. ప్రస్తుతం షటర్లకు నెలకు రూ.6,600 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ప్రస్తుతం అద్దెకుంటున్న వారి పీరియడ్ 2022లోనే అయిపోయింది. కొన్నేళ్లుగా ఇక్కడే వ్యాపారం చేస్తున్నందున తొలగిస్తే బాగుండదని పెంచిన అద్దె చెల్లించాలని జెడ్పీ యాజమాన్యం చెప్పినప్పటికీ వినిపించుకోలేదు. ఈప్రాంతంలో ఒక్కో షటర్‌కు దాదాపు నెలకు రూ.30 వేల వరకు అద్దె డిమాండ్ ఉంది. అద్దె పెంచాలని భావించిన క్రమంలో కలెక్టర్, జెడ్పీ ప్రత్యేకాధికారి పి.ప్రావీణ్య అద్దె ఖరారు, టెండర్ల ప్రక్రియ నిర్వహణకు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ శంకరయ్య, డీఈ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ విద్యాలత, డిప్యూటీ సీఈఓ రవితో కమిటీ వేశారు. ఈకమిటీ వాణిజ్య సముదాయం లీజుపై అధ్యయనం చేసి, అద్దెలను పరిశీలించి ప్రస్తుతం అద్దెకుంటున్న వారికి నెలకు రూ.19 వేలు ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు నవంబర్‌లో అగ్రిమెంట్ చేసుకోవాలని నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ నుంచి పెంచిన అద్దె చెల్లించాలని సూచించింది. అయితే ప్రస్తుత అద్దెదారుల నుంచి సానుకూలత రాకపోవడంతో టెండర్లు పిలిచారు.

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

- ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు నిర్వహణ
- జిల్లాలో జనరల్ విద్యార్థులు–15,683, ఒకేషనల్ విద్యార్థులు–956
- రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల గస్తీ

విద్యారణ్యపురి : ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు సీసీ కెమెరా నిఘాలో నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు గురుకులాలు, కేజీబీవీ, మోడల్‌స్కూల్‌లల్లో ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయి. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలలు ప్రాక్టికల్స్ పరీక్షా కేంద్రాలుగా ఉన్నవాటికి ఇంటర్‌బోర్డు సీసీ కెమెరాలను సమకూర్చబోతున్నది. ప్రైవేటు యాజమాన్యాల జూనియర్ కళాశాలలుగా ప్రాక్టికల్స్ కేంద్రాలుగా ఉన్నవారు ఆయా యాజమాన్యాలే సీసీ కెమెరాలను ల్యాబ్‌లలో ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈమేరకు ఇంటర్ బోర్డునుంచి జిల్లాల డీఐఈఓలకు కూడా తాజాగా ఆదేశాలు అందాయి. ఇంటర్మీడియట్‌లోని సెకండియర్ జనరల్ స్టూడెంట్స్ సైన్స్ విద్యార్థులకు, అలాగే ఒకేషనల్ కోర్సుల మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించబోతున్నారు. అందుకు సంబంధించి వివిధ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోజుకు రెండు సెషన్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తారు. హనుమకొండ జిల్లాలో 87 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేసి, 87మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులు 15,683 మంది, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు 1,956 మంది ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరు కానున్నారని హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ సోమవారం తెలిపారు.



సైన్స్ ల్యాబ్‌లో ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా అబ్జర్వర్ యాదగిరి (ఫైల్)

ప్రతీ ల్యాబ్‌లో రెండు సీసీ కెమెరాలు

ప్రతీ ల్యాబ్‌లో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ జిల్లాలోని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ యాజమాన్యాల కళాశాలల్లో సీసీ కెమెరాలను త్వరలోనే ఏర్పాటు చేస్తారని తెలిపారు. ప్రాక్టికల్స్ పరీక్షలకు ఎగ్జామినర్లను ఇంటర్ బోర్డు జూనియర్ కళాశాలల అధ్యాపకులను నియమించబోతున్నది. ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణ పర్యవేక్షణకు రెండు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించారు. జిల్లా పరీక్షల కమిటీ కూడా ఉంటుంది. అలాగే కలెక్టర్ చైర్మన్‌గా ఇతర సభ్యులతో కూడిన హైపవర్ కమిటీ కూడా ఈ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించనుంది.

ఇప్పటికే ప్రభుత్వ కళాశాలలకు నిధులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహణకు గాను సైన్స్ ల్యాబ్స్‌లలో పరికరాలకు, కెమికల్స్ కోసం ఇప్పటికే ఇంటర్ బోర్డు నుంచి నిధులు మంజూరయ్యాయి. ఒక్కో కళాశాలకు రూ.25వేల చొప్పున ప్రతీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధులు మంజూరు చేశారు. ఇదిలా ఉండగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం ఎలా చేస్తున్నారు.. ల్యాబ్‌ల నిర్వహణ ఎలా ఉందని ఇటీవలే ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి ఉమ్మడి వరంగల్ జిల్లా అబ్జర్వర్‌గా హనుమకొండ జిల్లాలో పలు ప్రభుత్వజూనియర్ కళాశాలలను సందర్శించి పరిశీలించారు.

వినతులు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : గ్రీవెన్స్‌లో వివిధ రకాల సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన వినతులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జీడబ్ల్యూఎంసీ 22, ఆర్‌డీఓ హనుమకొండ 8, తహసీల్దార్ ఎల్కతుర్తి 6తో పాటు మొత్తం 127 అర్జీలు రాగా వాటిని కలెక్టర్ నేరుగా ప్రజల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ.గణేష్, ఆర్డీఓలు రాథోడ్ రమేష్, నారాయణ, డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

దరఖాస్తులు వెంటనే పరిశీలించాలి

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాల కోసం ప్రజాపాలన గ్రామ/వార్డు సభల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి ఆన్‌లైన్ చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు భరోసా పథకంలో వ్యవసాయేతర భూముల గుర్తింపు మిగిలి ఉంటే వెంటనే నమోదు చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల్లో తప్పులు జరిగితే ఇప్పుడే సరిదిద్దాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ మేన శ్రీను, హౌసింగ్ అధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్, డీసీఎస్‌ఓ కొమురయ్య, ఆర్‌డీఓలు రాథోడ్ రమేష్, నారాయణ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో వినియోగదారులకు సౌలభ్యం



సోలార్ విద్యుత్ ప్యానల్‌కు రిజిస్ట్రేషన్ చేయిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : సోలార్ విద్యుత్‌తో వినియోగదారులకు ఎంతో సౌలభ్యం ఉంటుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సోలార్ విలేజ్ పైలట్ ప్రాజెక్టుపై వినియోగదారులతో అవగాహన సదస్సు నిర్వహించగా ప్రకాశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆత్మకూరులో 1,825 గృహాలకు, 468 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు రూ.20కోట్ల వ్యయంతో సోలార్ పవర్ ప్యానల్‌ను 100 శాతం సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం వినియోగదారులతో స్వయంగా రిజిస్ట్రేషన్ చేయించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ వెంకటరమణ, డీఈ సామ్యా నాయక్, ఎస్ఏఓ నవీన్‌కుమార్, రెడ్కో కోఆర్డినేటర్ మహేందర్‌రెడ్డి, ఏడీఈ దేవేందర్ నాయక్, ఆత్మకూరు, దామెర, పరకాల ఏఈలు వెంకటేశ్వర్లు, గుర్రం రమేశ్, రాజు సబ్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత సాధించిన హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా

వరంగల్ క్రైం/మడికొండ: భద్రాద్రి, కాళేశ్వరం జోన్ల పరిధి వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 108 మంది సివిల్ హెడ్ కానిస్టేబుళ్లకు మడికొండలోని సిటీ పోలీసు ట్రెనింగ్ సెంటర్‌లో సోమవారం అర్హత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షను పరిశీలించిన వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. పరీక్షలో అర్హత సాధించిన హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాలుగో పటాలం కమాండెంట్ రాంప్రకాశ్, అదనపు డీసీపీ రవి, వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, కిషన్, పాల్గొన్నారు. అనంతరం సీపీ మడికొండ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన గార్డెనింగ్, వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు.

స్పౌజ్ టీచర్ల బదిలీలకు కౌన్సెలింగ్

- 120 మంది టీచర్లకు పాఠశాలల కేటాయింపు
- రాత్రి 10 గంటలవరకు కొనసాగిన ప్రక్రియ

కేయూ క్యాంపస్ : వివిధ జిల్లాలనుంచి హనుమకొండ జిల్లాకు కేటాయించిన స్పౌజ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం నుంచి కలెక్టరేట్‌లో చేపట్టారు. మొత్తం 134 మందిని కేటాయించగా, ఇందులో ముగ్గురు టీచర్లు పరిశీలనకు హాజరుకాలేదు. మరో ముగ్గురి కేటగిరి తప్పుగా ఉన్నట్లు గుర్తించారు. మిగితా ఇద్దరు స్పౌజ్‌కు రాలేదు. అలాగే ఐదుగురికి ఖాళీలు లేవు. దీంతో 120 మంది టీచర్లతో సీనియార్టీ జాబితా వెల్లడించారు. ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎం తదితర కేడర్లకు చెందిన స్పౌజ్ టీచర్లకు క్లియర్ వేకెన్సీల్లో పాఠశాలలను కోరుకునేందుకు కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగింది. ఉదయం 9గంటలకు కౌన్సెలింగ్ అని జిల్లా విద్యాశాఖ సమాచారంతో ఆయా టీచర్లు హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అయితే ఆయా టీచర్లకు కనీసం కూర్చునేందుకు కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో కొందరు నిలబడి, మరికొందరు మెట్లపై, వరండాలో కింద కూర్చున్నారు. కలెక్టరేట్‌లో కూర్చునే సదుపాయం ఉన్నప్పటికీ అందులో కౌన్సెలింగ్ ప్రక్రియను ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఎంతమంది స్పౌజ్ టీచర్లు జిల్లాకు కేటాయించారో వాటినే ఖాళీలుగా చూపారు. సీనియార్టీ జాబితా కేడర్ ప్రకారం తొలుత స్కూల్ అసిస్టెంట్లకు, పీఎస్‌హెచ్‌ఎంలు, ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. రాత్రి 10గంటల వరకు అందరికీ కౌన్సిలింగ్ పూర్తయింది. డీఈఓ డి.వాసంతి, డీటీఓ ఎ.శ్రీనివాస్ కుమార్, పలువురు పీజీహెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

క్లుప్తంగా

సమన్వయంతో పనిచేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



హన్మకొండ అర్బన్ : జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకమని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం టీజీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ సంఘం నూతన సంవత్సర-2025 డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. సంక్షేమ ఫలాలను పేదలకు అందించడానికి చిత్తశుద్ధి, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధికారులకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని చెప్పిన ఆమె.. టీజీఓ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారి రాజేష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ.శ్రీనివాసరావు, ఆర్‌డీఓ రమేష్ రాథోడ్, డీఆర్డీఓ మేన శ్రీను, సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ బాధ్యులు కోలా రాజేష్, కిరణ్మయి, అన్నాల శ్రీనివాస్, వరంగల్ జిల్లా కార్యదర్శి ఫణికుమార్, జిల్లా అధికారులు, గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు రఘుపతిరెడ్డి, చేతన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాన్ అకాడమిక్ పాత్ర కీలకం

కాజీపేట అర్బన్ : విద్యా సంస్థల అభివృద్ధికి నాన్ అకాడమిక్ పాత్ర కీలకమైందని హన్మకొండ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. నిట్ వరంగల్ బోస్‌హాల్‌లో సోమవారం 'ఎంపవరింగ్ ఎక్సలెన్స్-కాంప్రెహెన్సివ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ నాన్ అకాడమిక్ స్టాఫ్' అనే అంశంపై మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ సౌజన్యంతో నిర్వహిస్తున్న వారం రోజు రెసిడెన్షియల్ షార్ట్ టర్మ్ ప్రోగ్రామ్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నాన్ అకాడమిక్ సిబ్బందికి నైపుణ్యం, ప్రాక్టికల్ నాలెడ్జ్, పనితీరు సామర్థ్యం పెంచేందుకు ఈ ప్రోగ్రామ్ వేదికగా నిలవాలన్నారు. జిల్లా స్థాయిలో తాము చేపడుతున్న కార్యక్రమాలను నిట్ వరంగల్‌లో చేపట్టడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురై

కూలీ పనికి వెళ్లి వస్తూ..

గూడూరు-అంబాల మధ్య ఆర్టీసీ బస్సు, టాటా ట్రాలీ ఢీ..

- 13 మందికి తీవ్ర గాయాలు
- ఇందులో చికిత్స పొందుతూ ఒకరు మృతి
- డ్రైవర్ పరిస్థితి విషమం

కమలాపూర్/హసన్‌పర్తి: ఆ బస్తీలో సుమారు 40 ఇళ్లు ఉన్నాయి. వీరందరూ నిరుపేదలు. బండకొట్టడం వీరి ప్రధాన వృత్తి. ఇక్కడ పురుషులతోపాటు మహిళలు కూడా కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటారు. ప్రస్తుతం స్థానికంగా ఉపాధి లేకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లి పనులు చేస్తున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం కూడా మరో ప్రాంతానికి వెళ్లారు. పనులు ముగిసిన అనంతరం టాటా ట్రాలీలో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఓ మహిళా కూలీ మృతి చెందింది. ట్రాలీ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని గూడూరు-అంబాల గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మునిపల్లికి చెందిన సుమారు 24 మంది కూలీలు కమలాపూర్ మండలం వంగపల్లికి వ్యవసాయ పనికి వచ్చారు. పని ముగించుకుని మధ్యాహ్నం టాటా ట్రాలీలో మునిపల్లి వెళ్తున్నారు. ఈ క్రమంలో ట్రాలీ గూడూరు-అంబాల గ్రామాల మధ్యలో ఓ ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాలీలో ప్రయాణిస్తున్న 13 మంది కూలీలు తీవ్రంగా, మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు.





బస్సును ఢీకొని బోల్తా పడిన ట్రాలీ, ఘటనాస్థలిలో క్షతగాత్రులు



హుస్సేన్‌బీ (ఫైల్)

సమాచారం అందుకున్న కమలాపూర్ సీఐ హరికృష్ణ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులందరినీ 108 వాహనాల ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మహిళా కూలీ హుస్సేన్ బీ (45) మృతి చెందగా, ట్రాలీ డ్రైవర్ అబ్దుల్లా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడిన వారిలో సమీనాబీ, యాకూబ్‌పాషా, స్వల్పంగా గాయపడిన వారిలో కరీమా, ముంతాజ్ బేగం, యాకూబ్‌బీ, ఆశ, రంజాన్, గౌసియా, హుస్సేన్ బీ, కరీంబీ ఉన్నారు. కాగా, సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ తిరుమల్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ బస్సు డ్రైవర్ బొట్ల మహేందర్ ఫిర్యాదు మేరకు ట్రాలీ డ్రైవర్ అబ్దుల్లాపై కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

కాగా, రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఎంజీఎంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏరుకొండ శ్రీనివాస్, స్వరూప ఉన్నారు.



నెరవేరనున్న 40 ఏళ్ల కల..!

- కాజీపేట బస్టాండ్ నిర్మాణానికి అడుగులు
- నేడు కలెక్టర్, ఆర్డీఓ, రైల్వే అధికారుల బృందం జాయింట్ ఇన్‌స్పెక్షన్ విజిట్

కాజీపేట రూరల్ : పట్టణ ప్రజల చిరకాల కోరిక కాజీపేట బస్టాండ్ కల త్వరలో నెరవేరబోతుంది. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కృషి, పట్టుదలతో 40 ఏళ్ల బస్టాండ్ సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. కాజీపేట బస్టాండ్, కాజీపేట రైల్వే డివిజన్, బోడగుట్ట ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, కాజీపేట స్టేషన్ సమీపాన రోడ్డు అండర్‌బ్రిడ్జి, ఇతర దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌నాథ్ కోట్లను వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. బస్టాండ్ కోసం ఎకరం భూమిని లీజ్ లేదా, రైల్వే భూమి ఇస్తే ప్రభుత్వ భూమి ఇవ్వడం, లేదంటే ప్రభుత్వ ధర ప్రకారం భూమి ఇవ్వాలని జీఎంను కోరామన్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా అధికారులు, రైల్వే అధికారుల బృందం కాజీపేట జంక్షన్‌లో రైల్వే సంఘ కార్యాలయం సమీపం నుంచి బ్రిడ్జి వైపు రైల్వే క్వార్టర్స్ స్థలాన్ని జాయింట్ ఇన్‌స్పెక్షన్ విజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఫాతిమా బ్రిడ్జి నిర్మాణం ఏప్రిల్‌లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. కాజీపేట బస్టాండ్ ల్యాండ్ ఫైనల్ కావడంతో పనులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఫాతిమా బ్రిడ్జి ప్రారంభం, కాజీపేట బస్టాండ్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిపిస్తామన్నారు. అలాగే, కాజీపేట చిరకాల వాంఛ కాజీపేట డిగ్రీ కాలేజీ, కాజీపేట ప్రభుత్వ ఆసుపత్రి మంజూరును ముఖ్యమంత్రితో అనౌన్స్‌మెంట్ చేయించాలన్నదే తన కల అని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తెలిపారు.



రైల్వే జీఎం ఏకే జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

42 శాతం రిజర్వేషన్ల హామీ ఏమైంది



హలో ముదిరాజ్..చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హన్మకొండ: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఏడాదైనా హామీపై ఇప్పటికీ స్పష్టత లేదని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా బీసీ కమిషన్ వేశారని దీనిపై కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆదేశానుసారం, బీసీల డిమాండ్‌తో డెడికేటెడ్ కమిషన్ వేశారన్నారు. అయినా ఇప్పటి వరకు రిజర్వేషన్లపై స్పష్టత లేదని విమర్శించారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడానికి ప్రతిపక్షంలో ఉన్న పార్టీ, అధికారంలో ఉన్న పార్టీయే కారణమన్నారు. బీసీలకు రాజకీయ పార్టీలు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలన్నారు. ఈసారైనా బీసీ కులగణన చేయాలన్నారు. ఉద్యమాలు, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలుగుతామన్నారు. హనుమకొండలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హలో ముదిరాజ్.. చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు పిట్టల శ్రీలత, నాయకులు చొప్పరి సోమయ్య, నీల రాజు, రాజకుమార్, దువ్వ నవీన్, పులి విక్రమ్, దువ్వ కనకరాజ్, పిట్టల సత్యనారాయణ, మహేందర్, బండి సతీశ్, ఉమాదేవి, అనురాధ, కిరణ్, రవి కుమార్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టి ఆటో బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు
- ఘటన ప్రదేశంలోనే మరో ఘటన

ఖిలా వరంగల్ : వరంగల్-ఖమ్మం హైవే మామూనురు టీజీఎస్పీ పెట్రోల్‌బంక్ స్పీడ్ బ్రేకర్ వద్ద లారీ ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం అర్ధరాత్రి అదే ప్రదేశంలో మరో రోడ్డు ప్రమాదం సంభవించింది. వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపునకు వెళ్తున్న ఆటో ఆకస్మాత్తుగా అదుపు తప్పి లారీని ఢీకొట్టి ఎదురుగా వచ్చే కారును ఢీకొని రోడ్డుపై అడ్డంగా బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా ఓ ప్రయాణికుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన నాగరాజు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి వరంగల్ నుంచి వర్ధన్నపేట వైపు ప్రయాణికుడిని ఆటోలో ఎక్కించుకొని బయలుదేరాడు. ఈ క్రమంలో నలుగురు మృతిచెందిన ఘటనాస్థలికి రాగానే ఒక్కసారిగా ఆటో అదుపుతప్పి లారీ, కారును ఢీకొడుతూ బోల్తా పడింది. గాయపడిన డ్రైవర్‌తో పాట ప్రయాణికుడిని స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు ఘటన స్థలం వద్ద రోడ్డుపై అడ్డుగా బోల్తా పడిన ఆటోను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.



హైవేపై బోల్తా పడిన ఆటో

బైక్‌ను ఢీకొన్న లారీ..

- వ్యక్తి మృతి
- కోతులనడుమ బ్రిడ్జిపై ఘటన



రాజేశ్వర్‌రావు (ఫైల్)

ఎల్కతుర్తి : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఎల్కతుర్తి మండలం కోతులనడుమ బ్రిడ్జిపై జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బచ్చు రాజేశ్వర్‌రావు(52) ద్విచక్రవాహనంపై కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తున్న క్రమంలో మార్గమధ్యలోని కోతులనడుమ బ్రిడ్జిపై ఎల్కతుర్తి నుంచి హుజూరాబాద్ వైపునకు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో రాజేశ్వర్‌రావుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్

- ఇప్పటికే సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఖరారు
- ప్లాన్‌పై 29న నోడల్ ఆఫీసర్ల సమీక్ష




హన్మకొండ: వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీలు, అధికారులతో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. వేసవిలో మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఈ నెల 29న అన్ని సర్కిళ్లలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్లకు నోడల్ అధికారులుగా సీజీఎంలను నియమించారు. హనుమకొండ సర్కిల్ (జిల్లా)కు చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్‌డీ) టి.మధుసూదన్, వరంగల్ సర్కిల్ (జిల్లా)కు చీఫ్ జనరల్ మేనేజర్ రాజు చౌహాన్‌ను నోడల్ ఆఫీసర్లుగా నియమించారు. వీరు బుధవారం ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ అధికారులతో సర్కిల్ కార్యాలయాల్లో సమీక్ష నిర్వహిస్తారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో చేపట్టిన పనులు, పూర్తయినవి, పురోగతిలో ఉన్న వాటిపై సమీక్షించి మిగతా పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

చెట్టు నరికివేతకు రూ.10వేల జరిమానా

వరంగల్ అర్బన్ : బల్దియా ఉద్యానవన విభాగం అనుమతి లేకుండా చెట్టు నరికివేసేందుకు రూ.10వేలు జరిమానా విధించారు. సోమవారం హనుమకొండలోని 30వ డివిజన్ బాలసముద్రం సైకిల్ పార్క్‌లో తబూబియా రోసియా చెట్టును అనుమతి లేకుండా తొలగించారు. దీంతో నరికివేసిన వారిని గుర్తించి రూ. 10వేలు జరిమానా విధించి వసూలు చేసినట్లు బల్దియా హెచ్‌ఓ రమేష్ తెలిపారు. నిబంధనల ఉల్లంఘిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని మున్సిపల్ చట్టం-2019 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో హార్టికల్చర్ అసిస్టెంట్లు అశ్విని ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

2న బీసీ రాజకీయ యుద్ధభేరి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రాజయ్య తదితరులు

నయీంనగర్ : బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఫిబ్రవరి 2వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న బీసీ రాజకీయ యుద్ధభేరి సభను యాదవులు, మహిళలు, ఉద్యోగులు విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనాభాలో అధిక శాతంగా ఉన్న యాదవులకు రాజకీయంగా 1శాతమే ప్రాతినిధ్యం ఉందన్నారు. 20 ఎమ్మెల్యేలు, ఐదు ఎంపీ సీట్లు యాదవులకు కేటాయించాలని యుద్ధభేరి సభలో రెజల్యూషన్ పాస్ చేస్తామన్నారు. అనంతరం యుద్ధభేరి పోస్టర్లు ఆవిష్కరించారు. యాదవులు అధిక సంఖ్యలో తరలివచ్చి యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిద్దిరాజు యాదవ్, 4వ డివిజన్ అధ్యక్షుడు బొంగు అశోక్ , కుమార్, కేదారి, శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారానికి నోచుకోని వినతులు

- కమిషనర్ ఎదుట ప్రజల ఆవేదన
- గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌కు 85 ఫిర్యాదులు
- స్వీకరించిన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: ప్రతీ సోమవారం గ్రీవెన్ సెల్‌లో దరఖాస్తు చేస్తున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదంటూ గ్రేటర్ వరంగల్ కమిషనర్ ఎదుట పలు కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో సోమవారం గ్రీవెన్స్‌కు 85 ఫిర్యాదులు అందాయి. ఈమేరకు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వినతులు స్వీకరించారు. ఇంజనీరింగ్ సెక్షన్‌కు 22 వినతులు, హెల్త్, శానిటేషన్ -13, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ) -4, టౌన్ ప్లానింగ్ -42, తాగునీటి సరఫరా -4 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌ఓ రమేష్, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, ఇన్‌చార్జ్ సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో వినతులు అందజేస్తున్న ప్రజలు

ఫిర్యాదుల్లో కొన్ని..

- మడికొండ- రాంపూర్ మధ్యలోని డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగతో అనారోగ్యం బారిన పడుతున్నామని పరిసర గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేశారు.
- 9వ డివిజన్‌లో డ్రెయినేజీని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, ఈక్రమంలో చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.
- 4వ డివిజన్ రెడ్డికాలనీలో మోరీపై ర్యాంపు నిర్మించడంతో రోడ్డు నిర్మాణం తగ్గిందని శ్రీవిఘ్నేశ్వర కాలనీవాసులు పేర్కొన్నారు.
- గోపాల్‌పూర్ ప్రగతినగర్‌కు రోడ్డుకు అడ్డంగా ఆర్చీ నిర్మాణం వల్ల 25ఫీట్ల రోడ్డు 19 ఫీట్లకు కుదించుకుపోతోందని ఫిర్యాదు చేశారు.
- 4వ డివిజన్ జ్యోతిరావుపూలే కాలనీలో డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు వేడుకున్నారు.
- 59వ డివిజన్ వికాస్‌నగర్ రోడ్డు -7లో రోడ్డుపై ఇల్లు నిర్మిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.
- హనుమకొండ రాంనగర్‌లో సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, తిరిగి నిర్మించాలని కాలనీవాసులు కోరారు.
- వరంగల్ పుప్పాలగుట్టల వద్ద కోతులు, పందులు, కుక్కల బెడద అధికంగా ఉందని, వాటిని కట్టడి చేయాలని ఫిర్యాదు చేశారు.
- 26వ డివిజన్ గిర్మాజీపేటలో రోడ్డు విస్తరణ పనులను మధ్యలో నిలిపివేశారని, పూర్తి చేయాలని విన్నవించారు.
- కాశిబుగ్గ 19వ డివిజన్ వివేకానంద కాలనీలో మట్టి రోడ్లతో అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు.
- పోచమ్మమైదాన్, తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, వాటికి అడ్డుకట్ట వేయాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు వేడుకున్నారు.
- కాశిబుగ్గ 11-2, 12 ప్రాంతాల్లో నల్లా నీరు రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు.

క్రమబద్ధీకరించాకే నియామకాలు చేపట్టాలి

- కాంట్రాక్టు అధ్యాపక కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న సాధురాజేశ్ తదితరులు


కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాకే రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల కోఆర్డినేషన్ కమిటీ బాధ్యులు డాక్టర్ సాధురాజేశ్, డాక్టర్ బి. సతీశ్ డిమాండ్ చేశారు. సోమవారం కేయూలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద నిర్వహించిన సమావేశం(గేట్‌మీటింగ్) వారు మాట్లాడారు. ఈనెల 26న హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు ఖాళీ అధ్యాపకుల పోస్టులను భర్తీచేస్తామని ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. అయితే కొన్నేళ్లుగా యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్నవారికి న్యాయం చేయాలన్నారు. అందుకు అన్ని విద్యార్హతలు కలిగి ఉన్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కమిటీ బాధ్యులు సత్యజాల, నాగేశ్వర్‌రావు, రఘువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, సూర్యనారాయణ, పాల్గొన్నారు.

హత్యాయత్నం.. రోడ్డు ప్రమాదంగా

కేసు నీరుగార్చేందుకు కుట్ర..

- ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం నిర్వాకం
- నిందితులతో కుమ్మక్కయ్యారని ఆరోపణ
- న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

హన్మకొండ చౌరస్తా: శత్రువుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రికి వచ్చిన బాధితుడికి వైద్యులు చికిత్స అందిస్తే.. రికార్డుల్లో మాత్రం రోడ్డు ప్రమాదంగా నమోదు చేసి కేసును నీరుగార్చే కుట్రకు పూనుకుంది ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం. తనకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానంలో పోరాడుతున్న సదరు యువకుడు ఆస్పత్రి యాజమాన్యం ఇచ్చిన మెడికల్ రికార్డులను చూసి ఆందోళనకు గురయ్యాడు. యాజమాన్యాన్ని ప్రశ్నించగా బెదిరింపులే దిక్కయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా వంగపహాడ్‌కు చెందిన శ్యాంరావు ప్రశాంత్‌కుమార్ 2022, జనవరి 20వ తేదీ రాత్రి 9 గంటలకు తన ఇంటి వద్ద ఉండగా కొందరు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రముఖ ప్రైవేట్ ఆస్పత్రికి(ఇటీవల పేరు మార్చారు) తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించి అత్యవసర చికిత్స అందించారు. తలపై 22కు పైగా కుట్లు వేయడంతో పాటు చేతి వేలు విరిగిపోగా సర్జరీ చేసి రాడ్డు వేశారు. మూడు రోజుల చికిత్స అనంతరం 24వ తేదీన ప్రశాంత్‌కుమార్‌ను డిశ్చార్జ్ చేశారు. మెరుగైన వైద్య కోసం అహ్మదాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో కొద్ది రోజులు చికిత్స పొంది కోలుకుని ఇంటికి చేరుకున్నాడు.



బాధితుడు శ్యాంరావు ప్రశాంత్‌కుమార్

ఆస్పత్రి మాయాజాలం

ప్రైవేట్ ఆస్పత్రిలో న్యూరో, ఆర్థో సర్జన్‌లు శస్త్ర చికిత్స చేసి వైద్యం అందించారు. ఆ సమయంలో ప్రశాంత్‌కుమార్ తనపై పది మంది దాడి చేశారని వారి పేర్లతో సహా తెలియజేశాడు. అతడి తండ్రి రఘు ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు చేయడంతో పాటు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మూడేళ్ల తర్వాత కేసు తాజాగా తుది దశకు చేరుకుంది. ఈ సమయంలో కీలకమైన మెడికల్ రిపోర్టును చికిత్స అందించిన సదరు ఆస్పత్రి యాజమాన్యం హత్యాయత్నం కాదు రోడ్డు ప్రమాదంలో గాయపడి వచ్చిన ప్రశాంత్‌కుమార్ చికిత్స అందించినట్లు చిత్రీకరించింది. విషయం తెలుసుకున్న ప్రశాంత్‌కుమార్ తనకు జరిగిన అన్యాయంపై ఆస్పత్రి యాజమాన్యాన్ని ప్రశ్నించడంతో ముందు రాజీ కు దుర్చుకుందామన్నారు. వినకపోవడంతో బెదిరిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులతో చేతులు కలిపి శిక్ష నుంచి తప్పించుకునేందుకు సహకరిస్తున్నారని ప్రశాంత్‌కుమార్ వాపోయాడు. ఈ విషయంపై డీఎంహెచ్‌ఓ అప్పయ్యకు ఫిర్యాదు చేశానని, నిందితులకు సహకరించిన ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పా టు తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. ఈ విషయమై ఆ ప్రైవేట్ ఆస్పత్రి చైర్మన్, ఆర్‌ఎంఓను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.